# ఇస్త్రీ - SKU



అర్జెంటు గా ఎదో ఊరు వెళ్ళాల్సి వచ్చి, బట్టలు సర్దటం మొదలెట్టాను. కానీ చూస్తే, బట్టలు ఉతికి లేవు. వాటిని వుతికాక, ఇస్త్రీ లేకుండా ఏం వేసుకువెళ్తాం అని ఇస్త్రీ చేయటం మొదలెట్టాను. కానీ చెప్పొద్దూ.. నాకు బట్టలు ఇస్త్రీ చేయాలంటే మహా చిరాకు. అందుకే సాధ్యం అయినంత వరకూ ఇస్త్రీ అవసరం లేని రకం బట్టలు కొంటాను. కానీ నేను వెళ్తున్నది ఎదో చుట్టాల ఇంటికి.. వాళ్ళింటికి ఆఫీస్ కి వేసుకుని వెళ్ళే బట్టలు ఏం వేసుకుంటాను అని చూడీదార్ లు ఇస్త్రీ చేయటం మొదలు పెట్టాను.

ఆ ఇస్త్రీ టైము లో నాకు సడెన్ గా నాన్నగారు చేసే ఇస్త్రీ ప్రహసనం గుర్తుకి వచ్చింది.

అది.. ఇండియా లో ప్రస్తుతం మాదిరి మరీ కరెంటు ఇంత ధారుణంగా షాకులు కొట్టని రోజుల మాట! అంటే, చంద్రబాబు APSEB పని పట్టని క్రితం మాట! ఏమిటీ.. రింగులు తిప్పటం మొదలెట్టాను అని గ్రహించేసారా? మరే.. ఆ పని మీదే వున్నాను!

ఆ.. చెప్పాను కదా కరెంటు చార్జీలు మరీ ఇప్పటి విధంగా పేల్చని రోజుల మాట! నాన్నగారికి ఫ ళఫెళలాడుతూ వుండాలి వొంటి మీద బట్టలు. దాని కోసం.. అమ్మ Revive పెట్టి గంజి పెడితే వద్దని పోరి, బట్టల కోసం ప్రత్యేకం ఒక రోజు ఎసరు పెట్టి బియ్యం పొయ్యమని పోరేవారు. మా అమ్మ గారు కూడా నాన్నగారి సాధింపు భరించలేక, ఆయన చెప్పినట్టే చేసేవారు. మా ఇంట్లో రొటీన్ ఏమిటంటే.. ప్రతీ ఆదివారం అమ్మ వాషింగ్ మిషిన్ వేస్తారు. ఆ వేసిన రోజు అన్నం ఎసరు పెట్టేవారు. వుట్టప్పుడు కుక్కర్ లో వంట.

ఆ ఎసరు పెట్టి వార్చిన గంజి ని, మధ్యాహ్నం సగం ఆరిన బట్టలకి పెట్టేవారు. అది మళ్ళీ గ్రేడింగ్ ప్రకారం చేసేవారు. ఫెళ ఫెళ లాడుతూ బట్టలు లేకపోతే మొఖం ముట ముట లాడించే మా నాన్నగారు, అక్కల బట్టలకి ముందు పెట్టేవారు. ఈ బట్టలు అయే సరికి, గంజి కొంచెం పల్చబడేది. అప్పుడు.. తన కాటన్ చీరలకీ, మా కాటన్ బట్టలకీ, స్కూలు యూనిఫారమ్ లకీ పెట్టేవారు.

ఆ బట్టలు తీసుకెళ్ళి పైన డాబా మీద ఎండపొడి లో ఆరేసేవారు. ఖర్మ కాలి వర్షం వచ్చినా, మబ్బు వచ్చి ఈ గంజి పెట్టిన బట్టలు సరిగా ఆరకపోతే.. ఆ బట్టలు తెచ్చి ఇంట్లో ఆరేసేవారు. తెల్లారేసరికి అవి ముతక వాసన, కుళ్ళు కంపూ కొట్టేవి. మహా చిరాగ్గా వుండేది అలాంటప్పుడు ఈ గంజి ప్రహసనం అంటే!

అమ్మ ఎప్పుడూ ఒక వారం స్టాక్ వుంచేవారు ఇస్త్రీ బట్టలకి. ఈ ఆదివారం గంజి పెట్టి ఆరేసిన బట్టలు వచ్చే వారం ఆదివారం నాన్నగారు ఇస్త్రీ చేసుకునేవారు. ఆయన కి మేమెవరమయినా తన పేంటులు ఇస్త్రీ చేస్తే అస్సలు నచ్చేది కాదు. తనే, ఆదివారం మధ్యాహ్నం ఒక కునుకు అయ్యాక రెండో గది లో గుమ్మానికి అడ్డంగా నేల మీద చాప పరచి, పైన ఇంట్లో వున్న మందం రగ్గులు నాలుగు పరచి.. ఇస్త్రీ కార్యక్రమం మొదలెట్టేవారు.

ఒక చిన్న బేసిన్ వుండేది. డాక్టర్ల దగ్గర సిరెంజులు కడగటానికి వుపయోగించే టైపుది. దానిలో

నీళ్ళు, ఆ నీటిలో ఒక మెత్తటి రుమాలు. కాళ్ళకి రబ్బరు చెప్పులు, (ఇస్త్రీ చేసేటప్పుడు షాకులు గట్రా తగలకుండా) పక్కన తనకి మాత్రమే గాలి తగిలేలా అమర్చిన టేబిల్ ఫేన్! (ఇస్త్రీ పెట్టె కి గాలి తగిలితే మళ్ళీ వేడి చల్లారిపోతుంది అని) ఇవన్నీ సిద్ధం చేసుకొని తన ఇస్త్రీ కార్యక్రమం మొదలెట్టేవారు. ఒక పక్క ఫేన్ తిరుగుతున్నా ఆయాసపడిపోతూ, ఇస్త్రీ చేస్తుంటే చమట్లు తెగ కారిపోయేవి. ఆయన కష్టం చూస్తే మా అమ్మమ్మ కోప్పడేది.. "ఎందుకురా అంత కష్టపడటం. ఆ రాజమ్మ కి ఇస్తే చేసిపెట్టదూ?!" అని.

కానీ నాన్నగారికి తన ఇస్త్రీ నే బాగుంటుంది అని భ్రమ! ఆయన అలా గుమ్మానికి అడ్డం గా బట్టల దుకాణం పెట్టడం వలన, మేమెవరమైనా అటూ ఇటూ వెళ్తూ కానీ కొంచెం దురుసు గా నడిచామా.. మా పని అయిపోయిందే! ఓ టెన్షన్ పడిపోతూ చేసేవారేమో ఒక్కసారి కోపం రివ్వున వచ్చేది. ఒకోసారి సంస్కృతం లో తిట్టేసేవారు కూడా. అమ్మమ్మ కూడా ఏమన్నా ఆ టైములో క్లాసులు పీకితే ఆయనకి చిర్రెత్తేది. నాన్నగారి మూడ్ ని అమ్మ ఇట్టే కనిపెట్టేసేవారు. ఆయన ఏకాగ్రత తో ఇస్త్రీ చేసుకునేటప్పుడు సాధ్యమైనంత వరకూ మేమెవ్వరం ఆయన ఏకాగ్రతకి భంగం కలిగేలా ప్రవర్తించకుండా జాగర్త పడేవారు.

ఆయన చేసుకుని.. తరువాత.. ప్లగ్ తీసేసాక, మమ్మల్ని చంపేవారు. "నీది, స్కూల్ డ్రెస్ ఇస్త్రీ చేసుకో.. పెట్టె వేడి గా వుంది" అని! మేమా.. ఎవ్వరమూ ఆయన మాట వినేవాళ్ళం కాదు.. బట్టల గురించి ఆయనకి వున్నంత శ్రద్ధ వున్నవాళ్ళమూ కాదు. కొంతలో కొంత మా అక్క ఒకోసారి ఆయన ఆజ్ఞ శిరసావహించేది. నేనూ, చిన్నదీ మాత్రం.. "ఆ.. ఆ స్కూల్ డ్రెస్ కి ఇస్త్రీ కూడానా!" అనేసేవాళ్ళం.

మా అమ్మగారు గంజి మిగిలితే రుమాళ్ళని కూడా ఆ గంజి నీళ్ళల్లో ముంచి తీసేవారు. గంజి పెట్టిన బట్టలు ఇస్త్రీ చేస్తే తొడుక్కోవటానికి బాగుంటాయి. కానీ, నాకు ఇస్త్రీ చేసుకునేంత ఓపికా, తీరికా వుండేవి కావు నా ఆటలు ధ్యాసలతో. ఆ గంజి పెట్టి ఇస్త్రీ చేయకుండా స్కూల్ డ్రెస్ వేసుకుంటే చండాలంగా వుండేవి. "అబ్బా గంజి పెట్టకమ్మా నా స్కూల్ డ్రెస్ కి" అని ఎన్ని సార్లు చెప్పినా వింపించుకునేవారు కాదు. ప్రతీ సోమవారం స్కూలు కి వెళ్ళేటప్పుడు ఇదొక రభస ఇంట్లో.

రుమాళ్ళకి గంజి అంటే గుర్తొచ్చింది, మా స్కూలు లో ఒక అమ్మాయి వుండేది.. వాళ్ళకి మహా చురుకైన పనమ్మాయి ఒకమ్మాయి వుండేది.. ఈ గంజి విషయం లో కొంచెం శ్రద్ధ ఎక్కువ. బట్టలకి గంజి పెట్టు తల్లీ అంటే, ఇంట్లో దొరికిన బట్టల్లా తీసుకెళ్ళి ఆ గంజి నీళ్ళల్లో ముంచి పారేసేదిట. ఆ ప్రభావం మా ఫ్రెండ్, వాళ్ళ తమ్ముళ్ళ మొఖాల్లో కనపడేది. అదే, పై బట్టలకి గంజి పెట్టి కర్ర ముక్క లా నిల్చుంటే అదో అందం.. అదే గంజి లోపల బట్టలకి వుండి ఆ బట్టలు గుచ్చుతుంటే?!

తరువాత కరెంటు చార్జీలు బాగా పెరిగి, మా నాన్నగారి ఇస్త్రీ సరదా కూడా చెట్టెక్కింది. అమ్మ కూడా మా అమ్మమ్మ అభిమాన ఇస్త్రీ అమ్మాయి రాజమ్మ చేతే మా బట్టలు కూడా ఇస్త్రీ చేయిపించేవారు. నాన్నగారికి ఆ అమ్మాయి చేసే విధానం నచ్చేది కాదు. కనుక వద్దని రోడ్ మీద వచ్చే ఇస్త్రీ బండి అబ్బాయిలకి ఇవ్వమని చెప్పేవారు.

ఒకసారి నాన్నగారు సందు లో తిరుగుతూ సిగరెట్ కాల్చుకుంటున్నారు. అమ్మ వీధిలో వెళ్తున్న

ఒక ఇస్త్రీ డబ్బా అబ్బాయిని పిలిచి నాన్నగారి బట్టలు ఇస్త్రీ కి ఇచ్చారు. నాన్నగారు తన బట్టలు అన్నీ ఇస్త్రీకి ఇచ్చారో లేదు చూసుకొని.. అక్కడే నుంచొని ఆ అబ్బాయి ఇస్త్రీ ఎలా చేస్తున్నాడో గమనించటం మొదలెట్టారు.

మరి ఈయన ఆ అబ్బాయికి ఇస్త్రీ చిట్కాలు చెప్పారో.. లేక ఆ అబ్బాయి ఇస్త్రీ చేసే పిధానం ఈయనకి నచ్చిందో తెలీదు కానీ, ఈయనకీ ఆ ఇస్త్రీ అబ్బాయికీ దోస్తీ కుదిరింది. అప్పటి నుండీ నాన్నగారు ఆ అబ్బాయి దగ్గరే ఇస్త్రీ చేయిపించటం మొదలెట్టారు. ఆ పిధం గా మా ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం నాన్నగారి ఇస్త్రీ ప్రహసనం తప్పింది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి, కాటన్ చీరలకి గంజి లేకపోతే ఎంత అందమైనా చీర అయినా అందం వుండదు. కానీ ఇక్కడ దొరికేది స్ప్రే గంజి మాత్రమే.. అందుకే ఇక్కడ చాలా మంది నా ఫ్రెండ్స్ ఇండియా వెళ్ళేప్పుడు ఈ గంజి పెట్టాల్సిన బట్టలు అన్నీ మూట కట్టుకెళ్ళి, తిరిగి వచ్చేప్పుడు వాటికి గంజి పెట్టించుకొని తెచ్చుకుంటూ వుంటారు. దీని ముందు నాన్నగారి పట్టింపు ఎంత!?

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి